సాక్షి
సిద్దిపేట
శుక్రవారం, 10, ఫిబ్రవరి, 2023



సంగాయిపల్లిలో కార్డన్ సెర్చ్

చిన్నశంకరంపేట మండలం సంగాయి పల్లిలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 8లో..



కొండెంగ దాడి

సంగారెడ్డి జిల్లా ఝరాసంగంలో రోడ్డున వెళ్లే వారిపై వారం రోజులుగా కొండెంగ దాడి చేస్తుండంతో భయాందోళన చెందుతున్నారు. 8లో..



కోమటిచెరువుకు కొత్త అందం

సిద్దిపేట కోమటిచెరువు శిగలో కొత్త అందం చేరింది. రూ.1.5లక్షలతో అడ్వెంచర్ వాటర్ రోలర్ గేమ్‌ను ఏర్పాటు చేశారు. 9లో..

ఉపాధ్యాయ ఉద్యమం

పదోన్నతి కల్పించాలని డిమాండ్

- భాషా, వ్యాయామ టీచర్ల సహాయ నిరాకరణ
- 9, 10 తరగతులకు నిలిచిన బోధన
- ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం
- జిల్లా వ్యాప్తంగా 460 మంది పండితులు, పీఈటీలు



ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న భాషా పండితులు (ఫైల్)

సాక్షి, సిద్దిపేట: ఎనిమిదేళ్ల తర్వాత రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల్లో అవకాశం కల్పించకపోవడంపై భాషా పండితులు, పీఈటీలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్నవారి ఆశలు అడిఆశలయ్యాయి. ఈ నేపథ్యంలో వాళ్లకు పదోన్నతులు కల్పించాలంటూ పాఠాలు బోధించకుండా సహాయ నిరాకరణ బాట పట్టారు. ఫిబ్రవరి 1వ తేదీ నుంచి తొమ్మిది, పది తరగతుల విద్యార్థులకు బోధన నిలిచిపోయింది. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో టీచర్లు నిరసన చేస్తుండడం విద్యార్థుల పరీక్ష ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా..

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో 460 మంది భాషా పండితులు, పీఈటీలు విధులు నిర్వర్తిస్తున్నారు. తెలుగు పండితులు 197, హిందీ పండితులు165, పీఈటీలు 98 మంది ఉన్నారు.

- ఉపాధ్యాయుల పదోన్నతి ప్రక్రియలో ఇతర ఉపాధ్యాయుల మాదిరిగానే తమకూ పదోన్నతులు లభిస్తాయని తెలుగు, హిందీ, ఉర్దూ భాషా పండితులు సంతోషించారు.
- గ్రేడ్–2 భాషా పండితులుగా కొనసాగుతున్న తమకు గ్రేడ్–1 హోదా కల్పిసారని వారు ఆశపడ్డారు. మరోవైపు పీఈటీలు కూడా తమకు పీడీలుగా అవకాశం ఇస్తారని ఆశించారు.
- ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న తమకు పదోన్నతిలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ హోదా వస్తుందని ఆశపడ్డారు.
- భాషా పండితులు, పీఈటీల పదోన్నతుల అంశం న్యాయస్థానంలో ఉన్నందున తీర్పు వచ్చేవరకు తామేమీ చేయలేమంటూ సర్కారు చేతులెత్తేయడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు.

తొమ్మిది రోజులుగా నిరసన

పదోన్నతుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కోరినా ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో వీరంతా నిరసనకు దిగారు.

- గ్రేడ్–1 కాకపోయినా ఇంత వరకూ 9, 10 వ తరగతులకు బోధిస్తూ వచ్చామని, తమ సేవలకు ప్రభుత్వం నుంచి గుర్తింపు లేనప్పుడు ఎందుకు బోధించాలని ప్రశ్నిస్తున్నారు.
- ఈనెల ఒకటో తేదీ నుంచి ఆ తరగతులకు బోధన చేయకుండా భాషా పండితులు నిరసన బాట పట్టారు.
- ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరుతూ భాషా పండితులు, పీఈటీలు రోజుకో తీరులో 9 రోజులుగా నిరసన తెలుపుతున్నారు.
- ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధన చేస్తూ, 9, 10 తరగతులకు మాత్రం దూరంగా ఉంటున్నారు.
- పండిత గ్రేడ్–2 ఉద్యోగం పొందినా అదే స్థాయిలో ఉద్యోగ విరమణ చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మండల వనరుల కేంద్రం, జిల్లా విద్యాశాఖాధికారికి వినతి, జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టి తమకు న్యాయం చేయాలంటూ విజ్ఞప్తి చేశారు. గత 9రోజులుగా ఆందోళనలు కొనసాగుతున్నాయి.
- పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న సమయంలో భాషా పండితులు నిరసలు తెలుపుతుండటంతో పదో తరగతి ఫలితాలపై ప్రభావం పడే అవకాశం ఉండనుంది.

వెంటనే అప్‌గ్రేడ్ చేయాలి



స్కూల్ అసిస్టెంట్‌లతో సమానంగా భాషా పండితులు విధులు నిర్వర్తిస్తున్నా.. గ్రేడ్ మాత్రం ఎస్‌జీటీగా ఉంది. అప్ గ్రేడేషన్ కోసం ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం స్పందించి ప్రమోషన్‌లు ఇచ్చేవరకు నిరసన తెలుపుతాం.

– కె.బద్రిరాజు, జిల్లా అధ్యక్షుడు, రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్

కోర్టు పరిధిలో ఉంది



భాషా పండితులు, పీఈటీలకు సంబంధించి పదోన్నతి అంశం కోర్టు పరిధిలో ఉంది. ప్రసుత్తం భాషా పండితులు, పీఈటీలకు బదిలీలు జరగుతున్నాయి. పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా బోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

కేసుల ఛేదనలో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: పోలీస్ స్టేషన్‌లో అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను తగ్గించాలని, కేసుల్లో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని సీపీ శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. గురువారం సీపీ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదుదారులకు రిసిప్ట్ ఇవ్వాలన్నారు. 2021, 22 పెండింగ్ కేసులను పూర్తి చేయాలని, పోక్సో ఎస్‌సీ, ఎస్‌టీ గ్రేవ్ కేసుల్లో త్వరగా ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. గంజాయి, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. రౌడీలు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘా పెట్టాలని, సైబర్ నేరాల్లో పరిశోధన పూర్తి చేసి, విస్తృతంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. లాడ్జిలు, పాత నేరస్తులపై నిఘా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిని గుర్తించి పెట్రోలింగ్ అధికారులు కేసులు నమోదు చేయాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, హుస్నాబాద్ ఏసీపీ సతీ ష్, సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ ఫణీందర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రఘుపతి రెడ్డి, హుస్నాబాద్ సీఐ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పీఎంపీ, ఆర్‌ఎంపీలకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గజ్వేల్: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న పీఎంపీ, ఆర్‌ఎంపీలకు గుర్తింపు సర్టిఫికెట్లు ఇవ్వాలని రాష్ట్ర గ్రామీణ వైద్యుల సమాఖ్య అధ్యక్షుడు, గజ్వేల్ జెడ్పీటీసీ మల్లేశం కోరారు. గురువారం అసెంబ్లీలో మంత్రి కేటీఆర్‌ను కలిసి 428 జీఓను సవరించాలని కోరుతూ మంత్రికి వినతి పత్రం అందజేశారు. సమస్యలపై మంత్రి కేటీఆర్ సానుకూలంగా స్పందించారని ఆయన తెలిపారు. ఆయనతో గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు హరిబాబు, రాజమౌళి, హుస్సేన్, రాజలింగం ఉన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్



అవగాహన కల్పిస్తున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేట ఎడ్యుకేషన్: ప్రభుత్వం పేద విద్యార్థుల కోసం బీసీ స్టడీ ఆధ్వర్యంలో ఉచితంతా అందిస్తున్న కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ మజామ్మిల్‌ఖాన్ అన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న గ్రూప్–2, ఎస్‌ఐ, కానిస్టేబుల్ 75 రోజుల పాటు అందిస్తున్న ఉచిత కోచింగ్ సెంటర్‌ను గురువారం అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ పరిశీలించారు. శిబిరంలో సౌకర్యాలను పరిశీలించి, అభ్యర్థులతో మాట్లాడారు. కష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించవచ్చని అన్నారు. లక్ష్యాన్ని సాధించేవరకు నిరాశ చెందొద్దని సూచించారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి జిల్లా అధికారి సరోజ, వక్త ఆజాద్ అహ్మద్, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణ దయాసాగర్, అధ్యాపకులు, స్టడీ సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఉజ్వల భవిష్యత్



పూజను సన్మానిస్తున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ సొంతం అవుతుందని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గత నెల కేరళలో జరిగిన దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థిని వీ.పూజ రూపొందించిన ప్రాజెక్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా గురువారం పాఠశాల హెచ్‌ఎం కరీమొద్దీన్ ఆధ్వర్యంలో విద్యార్థిని పూజ, గైడ్ టీచర్ హఫీజ్‌ను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అభినందించారు. విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి రామస్వామి, జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

అన్ని వార్డుల్లో డ్రైనేజీ నిర్మాణాలు

దుబ్బాక మున్సిపల్ కమిషనర్ గణేశ్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న కమిషనర్ గణేశ్‌రెడ్డి

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి అన్నారు. గురువారం లచ్చపేట 11వ వార్డులో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పారిశుధ్య సమస్య లేకుండా తీర్చిదిద్దేందుకే డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సందాల శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.1.08 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది



భక్తులు సమర్పించిన బంగారు, వెండి కానుకలు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ హుండీని గురువారం లెక్కించారు. ఆలయ ముఖ మండపంలో సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ రంగరావు ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది, శివశక్తి సేవాసమితి సభ్యులు హుండీని లెక్కించారు. 29 రోజుల్లో భక్తులు వేసిన కానుకలతో స్వామి వారి ఖజానాకు నగదు రూపంలో రూ.1,08,62,138 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి బాలాజీ తెలిపారు. విదేశీ కరెన్సీ 30నోట్లు, మిశ్రమ బంగారం 88 గ్రాములు, మిశ్రమ వెండి 13కిలోల 500 గ్రాములు, పసుపు బియ్యం 27క్వింటాళ్లు వచ్చాయని, నగదును బ్యాంక్‌లో జమ చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయ ధర్మకర్తలు, రఘువీరరెడ్డి, సౌజన్య, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగమే లక్ష్యంగా చదవాలి



మాట్లాడుతున్న డాక్టర్ అలీ

సిద్దిపేట ఎడ్యుకేషన్: పోటీ పరీక్షలకు ప్రయత్నిస్తున్న అభ్యర్థులు ఉద్యోగమే లక్ష్యంగా చదవాలని పోటీ పరీక్షల నిపుణుడు డాక్టర్ అలీ అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ సిద్దిపేట జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోటీ పరీక్షల అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత పోటీ తరుణంలో ప్రభుత్వ ఉద్యోగానికి డిమాండ్ పెరిగిందని, కష్టపడి చదివితే ఏదైనా సాధించవచ్చని అన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటికొండ రవి మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై పోరాడుతూ.. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలుగు తీసేందుకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు కార్యదర్శి అరవింద్, దాసరి ప్రశాంత్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు శేఖర్, నవీన్, వంశీ, వేణు, ఆనంద్, అంజలి, వర్ష, అంజన, తదితరులు పాల్గొన్నారు .

క్రీడల్లో రాణించడం గర్వకారణం

డీఈఓ శ్రీనివాస్ రెడ్డి



నర్సింలులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బోధనతో పాటు ఉపాధ్యాయులు క్రీడల్లో రాణించడం గర్వకారణమని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జాతీయ స్థాయి ఈత పోటీల్లో రజత పతకం సాధించిన ఉపాధ్యాయుడు బండి నర్సింలును జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి గురువారం మండల వనరుల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. అనంతరం డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గానికి చెందిన ఉపాధ్యాయుడు జాతీయస్థాయి ఈత పోటీల్లో బ్యాక్ స్ట్రోక్ 100 మీటర్, 50మీటర్, ఫ్రీ స్టైల్ 50 మీటర్‌లో రెండు సిల్వర్ మెడల్స్, 1బ్రాంజ్ మెడల్స్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటరెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్ రామస్వామి, దుబ్బాక ఎంఈఓ ప్రభుదాస్, సిద్దిపేట ఎంఈఓ యాదవ రెడ్డి, మద్దూర్ ఎంఈఓ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



అవగాహన కల్పిస్తున్న సోమిరెడ్డి

నంగునూరు(సిద్దిపేట): ఆయిల్‌పామ్ మొక్కల పెంపకంలో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆయిల్‌పామ్ ఫార్మర్స్ ఫెడరేషన్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎడ్ల సోమిరెడ్డి అన్నారు. రాజగోపాల్‌పేటలో ఆయిల్‌పామ్ పంటను గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు చక్కగా పెరిగాయని, గెలలు వస్తున్నందున జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవిలో మొక్కల వద్ద పాదులు తీసి డ్రిప్ ద్వారా నీరు అందించాలన్నారు. అంతర్ పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని అన్నారు. ఆయనతో చందు, కమాల్ శరీఫ్, ఇజారొద్దిన్, రవీందర్, ఈశ్వరయ్య, భిక్షపతి, చరణ్ ఉన్నారు.

స్ట్రీట్ కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలి

సిద్దిపేట బీజేపీ పాలక్ దేశ్‌పాండే



మాట్లాడుతున్న దేశ్ పాండే

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 25 వరకు నిర్వహించే స్ట్రీట్ కార్నర్ సమావేశాలను విజయవంతం చేయాలని సిద్దిపేట బీజేపీ పాలక్ దేశ్‌పాండే పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. శుక్రవారం పట్టణంలోని మెదక్ రోడ్డు పోచమ్మ గుడి వద్ద నిర్వహించే స్ట్రీట్ కార్నర్ సమావేశానికి సినీ యాక్టర్, బీజేపీ నాయకురాలు జీవిత రాజశేఖర్ హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని 75 శక్తి కేంద్రాల్లో సమావేశాలు ఏర్పాటు చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను సమావేశాల్లో ప్రజలకు వివరించాలని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ అంజన్ కుమార్ సిరిసిల్ల ఇన్‌చార్జ్ గంగాడి మోహన్ రెడ్డి, సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్ రావు, బీజేపీ సీనియర్ నాయకులు రామచంద్ర రావు, పట్టణ అధ్యక్షుడు పత్రి శ్రీనివాస్ యాదవ్, ఉడుత మల్లేశం యాదవ్, కోడూరి నరేష్, తొడుపునూరి వెంకటేశం, శివకుమార్ వివిధ మండలాల అధ్యక్షులు, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు భేష్



దామరకుంటలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

మర్కూక్(గజ్వేల్): జలశక్తి అభియాన్ ద్వారా చేపట్టిన ఉపాధి హామీ పనులు అద్భుతంగా ఉన్నాయని జాతీయ జలశక్తి అభియాన్ సైంటిస్ట్ రేష్మ పిల్లాయి, ఏడీ కృతిక కొనియాడారు. మండలంలోని దామరకుంట గ్రామంలో గురువారం పర్యటించి, ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన జలశక్తి అభియాన్ పనులను పరిశీలించారు. గ్రామంలో ఇంకుడు గుంతలు, నర్సరీ, ఉపాధి పనులు, భూగర్భ జలాలను రైతులు ఎలా వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ పీడీ గోపాల్‌రావు, ఏపీడీ కౌసల్యదేవి, ఎంపీటీసీ కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రి, ఉపసర్పంచ్ ఆంజనేయులు, ఎంపీడీఓ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ బల్దియాలో ముసలం

- చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం
- కలెక్టర్‌కు అందజేసిన మెజార్టీ కౌన్సిలర్లు
- సీఎం కేసీఆర్ 'ఇలాకా'లో కలకలం



కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్‌కు అవిశ్వాస తీర్మానం అందజేస్తున్న కౌన్సిలర్లు

గజ్వేల్: సీఎం కేసీఆర్ సొంత 'ఇలాకా' గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ముసలం మొదలైంది. అవినీతి, అక్రమాలకు పాల్పడటమే కాకుండా పాలనలో ఒంటెత్తు పోకడలను ప్రదర్శిస్తున్నాడని ఆరోపిస్తూ మొత్తం 20 మంది కౌన్సిలర్లకు గాను 14మంది మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళిపై తిరుగుబాటు జెండాను ఎగరేశారు. వారంతా సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని గురువారం కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్‌కు అందజేశారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్నాడని..

కలెక్టర్ కలిసిన అనంతరం కౌన్సిలర్లు సంయుక్తంగా విడుదల చేసిన ఓ ప్రకటనలో మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి తీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాము ప్రాతినిథ్యం వహిస్తున్న వార్డుల్లో అభివృద్ధిని అడ్డుకుంటూ ప్రజల్లో చులకనలయ్యేలా చేస్తున్నాడని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు అవినీతి, అక్రమాలకు కేరాఫ్‌గా మారి ఒంటెత్తు పోకడలను ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. చైర్మన్ విధానాలను సహించలేక సమష్టి నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. అవిశ్వాస తీర్మానంలో సంతకాలు చేసిన వారిలో గంగిశెట్టి చందన, షేక్ షహనాజ్, శీర్ల శ్యామల, పంబాల అర్చన, గుంటుకు శిరీష, దుంబాల లక్ష్మి, మర్కంటి వరలక్ష్మి, బబ్బూరి రజిత, మామిడి విద్యారాణి, కురాకుల శ్రీనివాస్, అత్తెల్లి శ్రీనివాస్, అల్వాల బాలేష్, బాలమణి, ఎంఏ రహీమ్ ఉన్నారు.

ఆది నుంచి వివాదాలే..

మూడేళ్ల పదవీ కాలన్ని పూర్తి చేసుకున్న పాలకవర్గంలో ఆది నుంచి వివాదాలే కొనసాగుతున్నాయి. 20 మంది సభ్యుల్లో 14 మంది టీఆర్‌ఎస్ నుంచి గెలుపొందగా, అర్చన, వరలక్ష్మి, దుంబాల లక్ష్మి, విద్యారాణి, రహీమ్, చందన ఇండిపెండెంట్లుగా, షహనాజ్ కాంగ్రెస్ నుంచి గెలుపొందగా వీరు కూడా టీఆర్‌ఎస్‌లో చేరారు. అయినా మున్సిపల్ పాలకవర్గంలో విభేదాలు మాత్రం తగ్గలేదు. 2022 ఫిబ్రవరి 28న పాలకవర్గం సమావేం తర్వాత బయటకు వచ్చిన మహిళ కౌన్సిలర్లు చైర్మన్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బహిరంగా ఆరోపణలు చేయడం అప్పట్లో కలకలం రేపింది. మొక్కలకు నీళ్లు పోయకుండానే నెలనెలా లక్షల్లో ట్యాంకర్లకు నిధులు డ్రా చేస్తున్నారని మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణ అనుమతుల్లోనూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని లంచాలు ఇవ్వనిదే అనుమతులు రావడం లేదని ఆరోపించారు. నెలవారిగా జరిగే సమావేశాల్లో వివిధ రంగాలకు ఖర్చు చేస్తున్న బడ్జెట్ వివరాలను తమకు ఇవ్వాలని కొంత కాలంగా తాము డిమాండ్ చేస్తున్నా.. లెక్కలు చూపడం లేదని ప్రధానంగా వారు ఆరోపించారు. అంతేకాకుండా ఇంటి నిర్మాణ అనుమతులు, నీళ్ల ట్యాంకర్ల బిల్లుల వ్యవహారం, డీజిల్, పెట్రోల్ వినియోగం, ప్రారంభోత్సవాల పేరిట అధిక ఖర్చులు చూపుతున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటన్నటికి తోడూ మున్సిపల్‌లో చైర్మన్ కుటుంబీకుల అతిజోక్యం కొనసాగుతుందని, చాలా సందర్భాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పనులను కూడా చేసి పెట్టాలని మందీమార్బలంతో వచ్చి హల్‌చల్ చేస్తున్నారనే ఆరోపణలు కూడా వచ్చాయి.

మార్పు నిర్ణయం అధిష్టానానిదే..

అవిశ్వాస తీర్మానం అనుకున్న విధంగా సాగితే చైర్మన్ మార్పు అంశాన్ని అధిష్టానానికే వదిలేయాలని అసంతృప్త కౌన్సిలర్లు ప్రస్తుతానికి నిర్ణయించినట్లు తెలుస్తోంది. ప్రస్తుత చైర్మన్ రాజమౌళి చేష్టలతో వేగలేపోతున్నామని, అందువల్లే అవిశ్వాసం ప్రవేశపెట్టాల్సి వచ్చిందని అధిష్టానాన్ని సమష్టిగా ఒప్పించాలని కూడా వారు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఒకరిద్దరూ నేతలు మాత్రం ఇప్పటికే చైర్మన్ పదవి కోసం పావులు కదుపుతున్నట్లు సమాచారం. వీరికి నియోజకవర్గానికి చెందిన బడా నేత సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎవరి ప్రయత్నాలెలా ఉన్నా ఈ అంశంపై అధిష్టానం ఏ విధంగా స్పందిస్తుందనేది ఉత్కంఠగా మారింది.

క్లుప్తంగా

షోకాజ్ నోటీసు జారీ

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ పట్టణంలోని అవుసులపల్లిలో రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్, హాట్ మిక్స్ ప్లాంట్ ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజనీర్ గౌతమి గురువారం తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి నుంచి ముందస్తు అనుమతి లేకుండా జనావాసాలకు కేవలం 130 మీటర్ల దూరంలో ఏర్పాటుచేస్తున్న ఎస్ఎల్ఎంబి ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్ లిమిటెడ్‌కు గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పేర్కొన్నారు. గాలి, నీరు కలుషిత నివారణ చట్టం 1974, 1981 ప్రకారం ప్లాంట్ ఏర్పాటుకు ముందస్తుగా సీఎఫ్‌సీ బోర్డు అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకు, ఆ సంస్థకు షోకాజ్ నోటీసు జారీచేస్తూ ప్లాంట్ నిర్మాణాలను తక్షణమే నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించామన్నారు.

విద్యార్థుల తరలింపుపై ఫిర్యాదు

సిద్దిపేటకమాన్: మున్సిపల్ కార్యాలయానికి చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వాహనంలో 18 ఏళ్ల లోపు విద్యార్థులను కంటి వెలుగు శిబిరానికి తరలించిన సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని సిద్దిపేట కాంగ్రెస్ నాయకులు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఫిర్యాదు చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారు కంటి వెలుగుకు అర్హులని ప్రభుత్వం చెబుతుందని, కానీ పాఠశాల విద్యార్థులను తరలించడంపై ప్రశ్నించినందుకు కాంగ్రెస్ నాయకులపై కేసులు ఎలా నమోదు చేస్తారని ప్రశ్నించారు. మున్సిపల్ శాఖకు చెందిన వాహనంలో విద్యార్థులను తరలించడంపై ఫిర్యాదు చేశామన్నారు.

జాబ్‌మేళాకు చక్కని స్పందన



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రతిభ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. మ్యాజిక్ బస్ డాట్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేళాకు ఐటీ, బ్యాంకుల ప్రతినిధులు హాజరయ్యారు. 533 మంది అభ్యర్థులకు గాను 134 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ సూర్యప్రకాశ్ మాట్లాడుతూ కళాశాల నుంచి విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహిస్తామని తెలిపారు.

మొబైల్‌షాపులో చోరీ

బాధితుడి ఫిర్యాదు.. కేసు నమోదు

మనోహరాబాద్(తూప్రాన్): మొబైల్ షాపులో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సందీప్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మనోహరాబాద్ మండల కేంద్రంలో దుర్గం శ్రీవర్ధన్ మొబైల్ షాపు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం వచ్చి చూడగా షాపు షట్టర్ తాళం పగలగొట్టి ఉంది. షాపులోని హెచ్‌పీ ల్యాప్‌టాప్‌ను గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సంగాయిపల్లిలో కార్డన్ సెర్చ్

- 25 ద్విచక్ర వాహనాలు సీజ్
- ప్రజలతో మమేకమయ్యేందుకే కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్
- తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

చిన్నశంకరంపేట(మెదక్): ప్రజలతో మమేకమయ్యేందుకే పోలీస్ కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి తెలిపారు. గురువారం చిన్నశంకరంపేట మండలం సంగాయిపల్లి గ్రామంలో పోలీసులుకార్డన్ సెర్చ్ నిర్వహించి 25 ద్విచక్ర వహనాలను సీజ్ చేశారు. ఇంటింటికి తిరిగి వాహనాలను వాటి పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలులేని వాహనాలను సీజ్ చేయాలని సిబ్బందిని డీఎస్పీ ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతు గ్రామస్తులను అప్రమత్తం చేసేందుకు కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామంలో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా అపరిచితులు తక్కువ ధరకు విక్రయించే ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయవద్దన్నారు. ప్రతీ ఒక్కరు వాహన పత్రాలను కలిగి ఉండటంతో పాటు బీమా కలిగి ఉండాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని, ఎవరికి ఓటీపీ చెప్పవద్దన్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే బ్లూ లింక్‌లను క్లిక్‌చేయవద్దని హెచ్చరించారు. గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో రామాయంపేట సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నశంకరంపేట, చేగుంట, నార్సింగి, రామాయంపేట, నిజాంపేట ఎస్ఐలు సుభాశ్‌గౌడ్, ప్రకాశ్‌గౌడ్, పోచయ్య, నర్సింహులు, రంజిత్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ ఇవ్వలేదనే మనస్తాపంతో..

బాలుడి ఆత్మహత్య



శరత్ మృతదేహం

బెజ్జంకి(సిద్దిపేట): తల్లిదండ్రులు సెల్‌ఫోన్ ఇవ్వడం లేదని బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని నర్సింహులపల్లె గ్రామానికి చెందిన చందర్‌రావు వ్యవసాయ చేస్తున్నాడు. అతడి కుమారుడు శరత్ 9వ తరగతి వరకు చదివాడు. మూడేళ్లుగా వ్యసనాలకు అలవాటు పడి ఇంటికి రావడంలేదు. అతడి సెల్‌ఫోన్ తీసుకున్న తల్లి దండ్రులు ఇంటి వద్దే ఉండాలని, చదువుకుంటూ వ్యవసాయంలో సాయం చేయాలన్నారు. రోజులో రెండు గంటలు మాత్రమే ఫోన్ ఇస్తామని చెప్పడంతో మనస్తాపంచెంది బుధవారం రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెజ్జంకి పీహెచ్‌సీకి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. బాలుడి తండ్రి చందర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ..



ప్రసాద్ (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం చిన్నశంకరంపేటకు చెందిన త్యావల(వడ్డే) కవిత కుమారుడు ప్రసాద్(17) జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. గురువారం కళాశాలకు వెళ్లలేదు. తల్లి కవిత పనికి వెళ్లగా ప్రసాద్ ఒంటరిగా ఇంటి వద్దనే ఉన్నాడు. పని చేసి ఇంటికి వచ్చిన తల్లికి కుమారుడు ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నశంకరంపేట ఎస్ఐ సుభాష్‌గౌడ్ తెలిపారు. శవపంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా



బేగంపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

బెజ్జంకి(సిద్దిపేట): వ్యవసాయానికి విద్యుత్ కోతలు విధించడాన్ని రైతులు ఆందోళన చేపట్టారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకరరెడ్డి ఆధ్వర్యంలో బేగంపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రత్నాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల వరికి వస్తున్న వైరస్‌లతో పంటలను ఎండబెట్టిన రైతులు నీరు పెట్టేందుకు వెళితే విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. ఒకేసారి విద్యుత్ సరఫరా చేయడం వలన డిమాండ్ పెరిగి లోఓల్టేజీతో మోటర్లు కాలిపోతున్నట్లు తెలిపారు. వెంటనే 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, రైతులు రామకృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంపత్‌రెడ్డి, హరీష్, రాజిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రాజురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

24 గంటలు కరెంట్ ఇవ్వాలని..

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యుత్ కోతలతో సాగు నీరందక పంటలు ఎండుతున్నాయని రైతులు ఆరోపించారు. మండలంలోని చెప్యాల క్రాస్‌రోడ్డులో గురువారం రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. సాగుకు 24 గంటల కరెంట్ ఇవ్వాల్సిందేనంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ ఇవ్వకుండా కోతలు పెడుతుండడంతో పంటలు ఎండుతున్నాయని, ఇది ఇలాగే కొనసాగితే పంటలు నష్టపోవాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. నిరంతర విద్యుత్ ఇస్తున్నాం అంటూ చెప్పడం కాకుండా ఆచరణలో చేసి చూపించాలని అన్నారు. విషయం తెలుసుకున్న మిరుదొడ్డి పోలీసులు రైతుల ఆందోళన వద్దకు చేరుకొని నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు రైతులకు కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. విద్యుత్ అధికారులు వచ్చి హామీ ఇచ్చేవరకు ఆందోళన విరమించేది లేదని రైతులు భీష్మించారు. దీంతో ఫోన్‌లో విద్యుత్ అధికారులతో పోలీసులు మాట్లాడారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని సంబంధిత అధికారులు ఫోన్ ద్వారా హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ఆందోళన విరమించారు. సుమారు గంట పాటు జరిగిన రైతుల ఆందోళనతో మిరుదొడ్డి గజ్వేల్ రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.



చెప్యాల క్రాస్ రోడ్డుపై బైఠాయించిన రైతులు

చికిత్స పొందుతున్న ఇద్దరి మృతి

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సిద్దిపేట వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట పట్టణ శివారు నాగదేవత ఆలయ సమీపంలో పెండ్యాల రాము ఎటువంటి సూచికలు లేకుండా ఆటోను పార్కింగ్ చేశాడు. కోరుట్లకు చెందిన బాలయ్య ఈనెల 4వ తేదీన బైక్‌పై వస్తూ ఆటోను ఢీకొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతడిని పరీక్షించిన వైద్య సిబ్బంది హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భిక్షపతి తెలిపారు.



దాసు (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఆత్మహత్యకు యత్నించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన మామిండ్ల ఈశ్వరయ్య, పద్మ దంపతుల కుమారుడు మామిండ్ల దాసు (25) వ్యక్తి గత సమస్యలతో నెల క్రితం పురుగుల మందు తాగాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడు మనోహరాబాద్ ఫారెస్ట్ ఆఫీస్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగి.

వాసవీ కన్యకాపరమేశ్వరీ మాతా శతకం ఆవిష్కరణ



శతకాన్ని ఆవిష్కరిస్తున్న మాధవానంద సరస్వతి తదితరులు

సంగారెడ్డి టౌన్: వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ తృతీయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిపై హాస్యబ్రహ్మ శంకర నారాయణ శతకం రాయడం హర్షణీయమని మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. శతకంలోని కొన్ని పద్యాలను చదివి వాటిలోని విశేషాలను వివరించిన శంకర నారాయణను మాధవానంద స్వామి అభినందించారు. శ్రీవాసవి కన్యకాపరమేశ్వరీ శతకాన్ని సంగారెడ్డిలోని వాసవీమాత ఆలయంలో గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాటల రచయిత, స్వరకర్త రాయారావు విశ్వేశ్వరరావు, ప్రముఖ జర్నలిస్ట్ దోర్బల బాలశేఖర శర్మ, శ్రీ వాసవీ మహా చైర్మన్ తోపాజి అనంత్‌కిషన్, వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ పుల్లూరు ప్రకాశ్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్: వ్యక్తి మృతి



అశోక్ మృతదేహం

జిన్నారం(పటాన్‌చెరు): వేగంగా వెళ్తున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన బొంతపల్లి ప్రధాన రహదారిపై గురువారం జరిగింది. ఎస్ఐ విజయకృష్ణ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మన్నె అశోక్(49) బైక్‌పై బొంతపల్లి నుంచి కొత్తపల్లి గ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. అతివేగంగా నడుపుతుండటంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించడంతో మార్గం మధ్యలోనే అశోక్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి కుమారుడు మన్నె వంశీకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తమై మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

డీసీఎం డ్రైవర్‌కు గాయాలు



గాయపడిన రఘుపతి

చిన్నకోడూరు(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో డీసీఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని మల్లారం శివారులో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన రఘుపతి(45) డీసీఎంలో కుర్చీలు తదితర సామగ్రితో కరీంనగర్ వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లారం శివారులో కొంత సామగ్రి డీసీఎం నుంచి కింద పడిపోవడంతో వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి కిందకు దిగే క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రఘుపతికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా సిబ్బంది ప్రాథమిక చికిత్స చేసి సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు.

మహిళ అనుమానాస్పద మృతి

- లైంగిక దాడిచేసి హత్యచేశారని అనుమానం?
- అడ్డా కూలీగా భావిస్తున్న పోలీసులు

జహీరాబాద్: మండలంలోని అల్గోల్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(45) మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. సీఐ భూపతి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పోలీసులకు గురువారం సాయంత్రం అటవీ ప్రాంతంలో మహిళ మృతదేహం ఉన్నట్లు అటవీ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలాన్ని సందర్శించి పంచనామా నిర్వహించారు. అడ్డా కూలీగా భావిస్తూ పట్టణంలోని కూలీ అడ్డాలపై వివరాలు సేకరిస్తున్నామన్నారు. సంఘటన గురువారం జరిగిందని సంఘటనా స్థలాన్ని బట్టి తెలుస్తోందన్నారు. మృతురాలి ఒంటిపై బ్లూ, రెడ్, బ్రౌన్, బ్లాక్ మిక్సింగ్ శారీ, బ్లూ కలర్ బ్లౌజ్ ధరించి ఉందన్నారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

పొగతో పంటలకు నష్టం



చెత్తను తగులబెట్టడంతో వ్యాపించిన పొగ

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మున్సిపాల్టీ సిబ్బంది సేకరించిన చెత్తను కూచనపెల్లి గ్రామ శివారులో పారబోస్తుండటంతో సమీప పొలాలు దెబ్బతింటున్నాయని రైతులు గగ్గోలుపెడుతున్నారు. తడి, పొడి చెత్త వేరుచేసి సేంద్రియ ఎరువు తయారు చేయాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా తగులబెడుతున్నారని మండిపడుతున్నారు. చెత్తను తగులబెడుతుండటంతో వాతావరణం కాలుష్యంతోపాటు వరి పంటలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడంలేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వృద్ధుడి అదృశ్యం



తుల్జయ్య(ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): ఇంటి నుంచి వెళ్లిన వృద్ధుడు కనిపించకుండా పోయాడు. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామానికి చెందిన తుల్జయ్య(80) ఈనెల 8వ తేదీన టీ తాగి వస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు తెలిసినవారిని, స్థానికంగా తెలిసిన చోట్ల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం కుమారుడు పండరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

అనుమతులిచ్చి అరెస్ట్ చేయడం సరికాదు



గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: ప్రజాసమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అవలంబిస్తున్న ధోరణిని నిరసిస్తూ చేపట్టిన ధర్నాకు అనుమతిచ్చి, అక్కడికి వెళ్లకుండా పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య మండిపడ్డారు. సీఐటీయూ, ప్రజాసంఘాల ఐక్య పోరాట కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు, బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేస్తూ ఇందిపార్క్ వద్ద ధర్నా చేపట్టారు. అక్కడకు వెళ్లకుండా ముందస్తుగా పోలీసులు గజ్వేల్ పట్టణంలో ఎల్లయ్యను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు అనుమతి ఇచ్చిన ప్రభుత్వం అక్కడికి వెళ్ళకుండా అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పేదలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వం కనీస బాధ్యత అన్నారు. ప్రభుత్వం ఇళ్లులేని అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించడంతో పాటు స్థలం ఉన్న వారికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు.

కొండెంగ దాడి

- భయాందోళనలో వాహనదారులు, ప్రజలు
- గాయపడినవారు ఆస్పత్రుల్లో చేరిక



గాయపడిన వ్యక్తికి చికిత్స చేస్తున్న వైద్యులు

ఝరాసంగం(జహీరాబాద్): వారం రోజులుగా కొండెంగ రోడ్డుపై రాకపోకలు సాగించేవారిపై దాడులు చేస్తుండంతో భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు పలు గ్రామాల ప్రజలు నిత్యం మండల కేంద్రానికి, ఝరాసంగం మీదుగా జహీరాబాద్‌కు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ క్రమంలో కొన్ని రోజులుగా రాకపోకలు సాగించేవారిపై కొండెంగలు దాడి చేసి తీవ్రంగా గాయపరుస్తున్నాయి. ఇప్పటికే మండల పరిధిలోని మేదపల్లి, గినియార్‌పల్లి, సదాశివపేట మండలం చందాపూర్ గ్రామాలకు చెందినవారు వీటి దాడిలో గాయపడ్డారు. సంగారెడ్డి, హైదరాబాద్‌లోని ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాజాగా గురువారం రాయికోడ్ మండల పరిధి యూసుఫ్‌పూర్ గ్రామానికి చెందిన యాదుల్‌పై కొండెంగ దాడి చేసింది. అతడు ఝరాసంగంకు పని మీద వచ్చాడు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్దకు రాగానే కొండెంగ దాడి చేయటంతో కాలుకు గాయమైంది. దీంతో ఝరాసంగం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. గ్రామ పంచాయతీ ద్వారా కొండెంగను పట్టుకునేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

టిప్పర్ బోల్తా



పొలంలో బోల్తాపడిన టిప్పర్

కొల్చారం(నర్సాపూర్): కొల్చారం నుంచి మెదక్ వైపు మట్టిలోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ సంఘటన కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి గ్రామ శివారు నర్సాపూర్ మెదక్ జాతీయ రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో టిప్పర్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

భూ సర్వే అధికారుల అడ్డగింత



కొండాపూర్‌లో అధికారుల వాహనాన్ని అడ్డుకుంటున్న రైతులు

మనోహరాబాద్(తూప్రాన్): భూ సర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో 126 సర్వే నంబర్‌లో సుమారు 16 ఎకరాల భూమి ఉంది. గ్రామానికి చెందిన పది మంది పట్టా కలిగిన రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కాగా హైదరాబాద్‌కు చెందిన వెల్లూర్ ప్రభాకర్ గిరిధర్ ఈ సర్వే నంబర్‌లో సుమారు రెండు ఎకరాలు కొనుగోలు చేశాడు. సర్వే చేయడానికి స్థానిక రైతులకు నోటీసులు ఇచ్చారు. సర్వే చేయడానికి ఆర్ఐ సునీల్‌చౌహాన్, సర్వేయర్ బాలు రావడంతో వారిని అడ్డుకున్నారు. వారిపై దాడికి యత్నించడంతో వెనుదిరిగారు. తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా అందరికీ నిబంధనల ప్రకారమే నోటీసులు ఇచ్చి సర్వే చేయడానికి వెళ్లినట్లు తెలిపారు. పలు సర్వే నంబర్లలో భూములు ఒక దగ్గర, రికార్డులు మరోదగ్గర ఉన్నట్లు తెలిపారు. సర్వే కోసం భూయజమాని దరఖాస్తు చేసినట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై కనువిప్పు కార్యక్రమం



మాట్లాడుతున్న దుబ్బాక సీఐ కృష్ణ

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట సీపీ ఆదేశాల మేరకు అక్బర్‌పేట–భూంపల్లి మండల పరిధిలోని బేగంపేటలో బుధవారం రాత్రి భూంపల్లి పోలీసులు కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే బ్యాంకు, ఓటీపీ వివరాలను తెలపొద్దని ఆటపాటల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దుబ్బాక సీఐ కృష్ణ, పోలీస్ కళా బృందం సభ్యులు బాల్‌నర్సు, రాజు, రవీందర్, తిరుమల, ఏఎస్ఐ రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.